# నా మరదలు

## కప్పగంతుల సత్యనారాయణ

౧

గ్రయ్యమని మోటారు ఎలెక్ట్రిక్ హారన్ ధ్వని, కీచుమని బ్రేకు వేసినచప్పుడు, ఒకదాని వెంబడి ఒకటి రోడ్డంతా ప్రతిధ్వనించాయి. రోడ్డుమీద నడిచే ప్రతి వాళ్లతోటి సమంగా ఆ చప్పుడు నేనూ విన్నాను. హఠాత్తుగా నా శరీరమంతా గాలిలో ఎగిరేటంత తేలిక అయిపోయింది. తరువాత ఏంజరిగిందో నాకు తెలియదు.

కళ్లు తెరిచి చూసేటప్పటికి నేను యింకో ప్రపంచంలో కళ్లు మూసుకోక పూర్వంవున్న స్థితి మారిపోయి వున్నానని బలహీనంగా వున్న నా మెదడుకు స్ఫురించడానికి చాలాసేపు పట్టింది. కాలికి కట్టు, తలకి కట్టు, కడుపులో బలహీనత్వము వల్లనూ, ఆకలివల్లనూ కలిగేమంటా, కళ్లు తెరిచేవుంచి పరిసరాలను స్పష్టంగా చూడలేక పోవటమూ, అంతా అయోమయ మనిపించింది. ఆచోటూ, అక్కడికి నేను వెళ్లటానికిగల కారణమూ, నా తలమీదా కాలికీ కట్లూ ఎందుకుండవలసి వచ్చిందో ఊహించుకోగల సామర్థ్యముకూడా మనస్సుకు లేకపోయింది. కళ్లు మూసుకున్నాను. ఊహించి పరిస్థితులు అర్థం చేసుకోలేను. ఊహించకుండా ఉండలేను. ఏవో ఆలోచనలు ఒకదానితో ఒకటి సంబంధము లేనివి మనసులో మెల్లిగా దొర్లుతున్నాయి. కళ్లు కొంచెం మసకబడి, తెరపి యివ్వడము ఆరంభించాయి.

నా మంచంలాగే ఓ డజనుమంచాలూ, రివ్వున తిరుగుతూ ఎలక్ట్రిక్ పంకాలూ ఆస్పత్రిలో ఉన్నానా యేమిటి చెప్మా అనుకున్నాను. అనుకోవడ మేమిటి, నిర్ధారణ పరచుకోవడ మేమిటి, రెండూ ఒకేసారి జరిగాయి.

దాహం అమితంగా వేస్తోంది. అడగటానికి తగినంత సత్తువకూడా లేదు. సన్ననిగొంతుతో, కుడిచెయ్యి పైకెత్తి ఇంగ్లీషులో 'మంచినీళ్లు' అన్నాను. నా తలవైపు కిటికీదగ్గర కూర్చుంది కాబోసు నర్సు, 'ష్ ష్, మాట్లాడ కూడదు' అంటూ నా యెదుటికి వచ్చింది.

మసకగాఉన్న నా చూపులో, ఆమెరూపు అసమాన సుందరంగా ప్రతిఫలించింది. ఆమె డ్రెస్సు, ఆలోల కర్ల్సు, ఆ నల్లటికళ్లు ఆమెరూపు చూస్తూ నాకు దాహ మేస్తోందన్న మాటే మరిచిపోయాను. ఏ ఆలోచనా లేకుండా ఆమెకేసి చూస్తూ, నాబాధ మరచిపోయాను.

చల్లటి తన కుడిచేతిని నానుదుటిమీద పెట్టి, నా మొహానికి దగ్గరగా తన మొహం పెట్టి 'మీరు ఎక్కువగా మాట్లాడకూడదు. ఆయాస పడకూడదు. ఏంకావాలిప్పుడు ?' అంది.

సన్నని, మృదువైన గొంతుకతో, అంత ఆదరంగా ఆమెపలికిన పలుకులు నా గుండెలోకి చొచ్చుకున్నాయి. కాని, నిజంగా మాట్లాడేంత శక్తి నాలో లేదు. ఆమె మాటలకీ, రూపానికీ పరవశుణ్ణి అయిపోయాను. మంచి నీళ్లు తెమ్మంటే వెళ్లిపోతుందేమో అని భయమేసింది. అక్కడనుంచి ఆ నర్సు వెళ్లిపోవడానికి నాకు యెంత

మాత్రమూ యిష్టం కలగలేదు. ఆమె కళ్లలోకి చూస్తూ నా నుదుటిమీద వేసిన ఆమె చెయ్యిని గట్టిగానొక్కి పట్టుకున్నాను.

రెండు నిమిషాలు అలావుందేమో తన యెడమచేత్తోటి కుడిచెయ్యి పట్టుకున్న నాచేతిని విడిపించి 'డాక్టరువచ్చే వేళయింది, త్వరగా చెప్పండి, మీకు యేంకావాలో?' అంది.

ఏం చెయ్యలేక పోయాను. 'దాహమేస్తోంది' అన్నాను. చేత్తోటి మెల్లిగా బుగ్గమీద రాసి, తీక్ష్ణంగా నాకళ్లలోకి చూసి వెళ్లింది, మంచినీళ్లు తేవడానికి; ఆచూపులో వున్న దయ, కరుణ, ఆమెలో దేవత్వము వుందా! అని పించాయి.

ఆమె మంచుగడ్డవేసిన నీళ్లుతెచ్చి నా గొంతుకలో పోస్తూవుంటే, అమృతపుధార ప్రవహించిందా, నా గొంతుకలోకి అనిపించింది.

నీళ్లుత్రాగిన కొంచెంసేపటికి నాకు నిద్రపట్టింది.

౨

మళ్లీ నాకు మెళకువ వచ్చేసరికి, మా తమ్ముడు నా ప్రక్కన కూచునివున్నాడు. వాడి చేతులో వున్న వ-లక్ష్మీ నారాయణగారి 'మాలపల్లి' ఉంది.

'ఏలావుంది, అన్నయ్యా?' అన్నాడు.

'తల కొంచెం తిరుగుతూన్నట్టుగా వుంది, కాళ్లూ చేతులూ నీరికే పీకుతున్నాయి, ఇదంతా ఏమిటిరా?' అన్నాను.

'కారు క్రిందపడి పోయావు. పోలీసులు నిన్ను యిక్కడ చేర్పించి, నీ జేబులోవున్న వుత్తరాలను పట్టి మనగది అడ్రసు కనుక్కొని నాకువచ్చి చెప్పారు. రెండు సార్లు వచ్చాను యిక్కడికి, రెండుసార్లూ నువ్వు మంచి నిద్రలో వున్నావు. వెళ్లిపోయాను, స్కూలుటైము అయి పోవడంచేత' అన్నాడు నా తమ్ముడు.

'ఒరే, యీసంగతి యింటికి రాయకుసుమా, అమ్మా నాన్నా బెంగపెట్టుకొని పరుగెత్తి వస్తారు. చస్తాం యిద్దరమూనూ, గొడవలోపడి' అన్నాను నేను.

'లేదులే, కాని స్కూలులోమాత్రం మా ప్రిన్సిపాల్‌తో నేను యీ సంగతి చెప్పేశాను' అన్నాడు మావాడు.

ప్రిన్సిపాల్‌తో చెపితే ఫరవాలేదు కాని స్టూడెంట్సుకి యెవరికీ చెప్పకు. ఈ వంకతో తయారవుతారు అంతా యిక్కడికి' అన్నాను. మావాడు మాట్లాడ లేదు.

'ఆ పుస్తకం యేమిటిరా, మాలపల్లా ఏదీ' అని వాడి దగ్గరనుండి పుస్తకం తీసుకొని ఏడెనిమిది పేజీలు తిప్పి, ఇక్కడ వుండనిస్తూ, తోచడంలేదు' అన్నాను. వాడు యేమీ మాట్లాడలేదు.

కాసేపు అలాగే కూచుని 'డబ్బు ఏమైనా కావాలా, ఎందుకూ, దగ్గరవుంటే పీడించుకు తింటారు వీళ్లంతాను పళ్లూ అవీ కావలిస్తే నేనే పట్టుకొచ్చి యిస్తాను...... అయినా... ఈ 'రుపీ' నీ దగ్గరవుండనీ; అర్జంటుగా ఏమైనా కావలిస్తే వుంటుంది; అని రూపాయ చిల్లరతీసి నా పక్కమీద పెట్టాడు.

ఆరుగంటలయింది. చీకటి చాయలు క్రమ్ముకున్నాయి. ఆస్పత్రిలో దీపాలన్నీ వెలిగాయి ఒక్కసారి 'స్విచ్' వేసి తిరిగిచూశాను. అప్పుడే 'స్విచ్' వేసి, హాలుమధ్య వున్న బల్లదగ్గరకు వస్తోంది...ఆ నర్సు, నా మనస్సు ఒక్కసారిగా సంతోషంతో నిండిపోయింది.

మావాడు లేచి 'నేను వెడతానురా' అన్నాడు.

'ఊఁ. రేపు ప్రొద్దున్నేరా' అంటూ ఏదో చెప్ప బోయాను. ఆనర్సు...మా దగ్గరకి వచ్చింది, పాలగ్లాసు చేతులో పట్టుకొని.

'పాలు త్రాగండి' అంటూ నా గొంతుకలో పోసింది, మెల్లిగా ఆ పాలన్నీని. చూస్తూ మావాడు అక్కడే నుంచు న్నాడు. నాకు కోపంవచ్చింది, వాడు వెళ్లిపోనందుకు. పాలగ్లాసు ఖాళీకాగానే, ఆమె వెళ్లిపోయింది. 'ఆల్ రైట్' వెడుతున్నానురా' అని మావాడు వెళ్లిపోయాడు, వాడిమీద నాకు అమితకోపం వచ్చింది.

ఎనిమిదిగంట లయింది. 'వార్డు'లో వున్న రోగులలో చాలామంది నిద్రలోమునిగి తేలుతున్నారు అప్పుడే. నాకు మాత్రం నిద్రపట్టలేదు. నాకళ్లు కుర్చీలో కూచుని వ్రాసు కుంటూనూ, పిలిచిన ప్రతి రోగిదగ్గరికీ వెళ్లివస్తూనూ, తనడ్యూటీ తను చేసుకుంటూవున్న, ఆ నర్సు మీదనే వున్నాయి. ఈ నానా రోగాలతోటీ అవస్థపడుతూ, తలుచుకోడానికి కూడా అసహ్యంగా వుండే యీ దౌర్భాగ్యులందరికీ విసుగూ, చిరాకూ లేకుండా అలా పరిచర్య చేస్తోంది, ఆమెమనసు నిజంగా ఎంత కోమలమైనదో! ఇలాటి చక్కని స్త్రీ ఇందులోసమా పుట్టుతే, పాపం నాకు చాలా జాలివేసింది.

ఆమె గడియారంకేసి చూసింది. ఆమెతోపాటు నేనూ చూశాను. ఎనిమిదింబావు... చేతిలోవున్న కలం బల్లమీద పెట్టి, కుర్చీలోనుంచి లేచి, నావైపు చూసింది. మా యిద్దరికళ్లూ కలుసుకున్నాయి మెల్లిగా నాదగ్గరికి వచ్చింది. ఆమె పెదవులమీద చిరునవ్వు తాండవ మాడింది, నాకు సంతోషం ఒళ్లంతా పొంగించివేసింది.

'ఇంకా పడుకోలేదూ' అంది, తనరెండు చేతులూ నడుముమీద పెట్టుకుని.

'ఇంకా నిద్రరాలేదు. మీరు రాత్రిడ్యూటీయా?' అన్నాను నేను.

'అవును, ఇంకా వారంరోజులదాకా' అన్నది ఆమె.

'తరవాత' అన్నాను నేను. నాకు చాలా భయం వేసింది. ఆ వార్డులో డ్యూటీ అయిపోయి, ఆమె ఇంకో వార్డుకి వెళ్లిపోతుందేమోనని,

'తరువాత పగటిడ్యూటీ...' అంది ఆమె.

'ఈ వార్డులోనేనా?' అన్నాను నేను పట్టలేక.

'బహుశా, చెప్పలేను' అంది ఆమె. నేను ఆలోచనలో పడిపోయాను. అప్పటిదాకా దేవుడుమాట తలవని నేను, యీ వార్డులోనే ఆమెను వుండేటట్టుచెయ్యమని శ్రీ కృష్ణభగవానుణ్ణి ప్రార్థించుకున్నాను.

'ఇందాకా వచ్చిన ఆయన ఎవరు?' అని అడిగింది మెల్లిగా, నాకు కొంచెం దుఃఖము వచ్చింది. వాడి సంగతి యెందుకూ, ఆమెకి?

'మా తమ్ముడు' అన్నాను.

'ఏం చేస్తున్నారు యిక్కడ?' అని మళ్లీ అడిగింది.

'చదువుతున్నాడు' అన్నాను.

'ఏమిటి?' మళ్లీ వాడిని గురించే యింకో ప్రశ్న వేసింది.

'బి. ఏ.' అన్నాను.

'మీరు?' అంది, ఆమె.

ఇంతసేపటికా నామాట!

'ఎమ్మే' అన్నాను. వెంటనే

'అయిందా, అవాలా?' అంది ఆమె.

'రెండో సంవత్సరం, అవుతోంది అన్నాను.

'మీ తమ్ముడిపేరు?' అని మళ్లా వాడి సంగతిలోకి దిగింది.

'మోహనరావు' అన్నాను.

ఈసారి వాడిసంగతి అడిగితే జవాబు చెప్పదలచుకోలేదు నేను.

'ఆపుస్తకమేమిటి?' 'అంది,' కొంచెంసేపు ఊరుకొని.

'మాలపల్లి అని, తెలుగునవల' అన్నాను నేను.

'చదువుకుందుకు యిస్తారా' అని అడిగింది.

'తెలుగు తెలుసునా మీకు' అన్నాను.

'మేము తెలుగువాళ్లమే' అలాగంది.

నావొళ్లు ఝల్లుమంది. తెలుగువాళ్లా? బ్రాహ్మణది కూడా అయితే బావుండును. మాలపల్లి ఆమెకు యిచ్చాను. తీసుకొని రెండడుగులు వేసింది.

'ఇదిగో, మాట, నీపేరు' ఈసారి తెలుగులో అడిగాను.

'నాపేరా......' చిన్న నవ్వునవ్వి 'పద్మావతి' అంటూ వెళ్లి కుర్చీలోకూచుని మాలపల్లి చదవడం ఆరంభించింది.

✻

మరునాటి సాయంత్రము ఆరుగంటలకి మా తమ్ముడు వచ్చాడు. కొంచెం యించుమించుగా ఆదేవేళ వాడు వచ్చినతరువాత పద్మావతి వచ్చింది. నాతోటి కబుర్లుచెపుతూ మావాడు నాదగ్గరే చాలాసేపు కూచున్నాడు. నాకు విసుగేసింది. వాడు త్వరగా వెళ్ళిపోతే, పద్మావతిని పిలిచి యేమేనా మాట్లాడుదామని నామనసు ఉవ్విళ్ళూరుతూ ఎలాగో పడుతుంది. వాడుమాత్రం, ఏదో లోకాభి రామాయణం చెప్తూ, నేను పరాధ్యానంగా వున్నట్టు కనపడితే, నాదృష్టి యెటుందో అటే తనకళ్లు కూడా తిప్పేవాడు. వాడు పద్మావతికేసి చూడటము తోటే నామనసు చివుక్కుమనేది మా తమ్ముడిమీద, అది వరకు యెప్పుడూ లేని యేహ్యమైనభావం కలిగేది, కాని ఆ భావం వాడికి తెలియచెప్పడానికి ధైర్యంలేదు. వాడు ఆమెవైపు చూడటం యిష్టంలేదు. అక్కడికీ గ్రహిస్తాడేమోనని, ఏదో సందర్భంలో నర్సులమాట యెత్తి, వాళ్లంతా చెడిపోయిన బాపతనీ, మొగాళ్లని యిట్టే వలలో వేసుకొని నాశనంచేసి వొదుల్తారనీ, అంతటి మోసగత్తెలు ప్రపంచంలో ఉండరనీ, పచ్చి బోగందాన్ని అయినా నమ్మవచ్చును కాని, నర్సునుమాత్రం కలలో అయినా నమ్మకూడదనీ, ఒక చిన్న లెక్చరు విసిరాను. దానిమీద మావాడు అందుకొని, ఎక్కడో ఒకరిద్దరు తప్ప తక్కిన వాళ్లంతా చాల మంచిగుణాలు కలవాళ్లనీ, అంత సౌమ్యమైన, మృదువైన, ప్రేమపూరితమైన హృదయం గల వాళ్లు యిల్లాండ్రలో కూడా వుండరనీ, నిజంగా సంసారంలో మహానందం అనుభవించాలంటే, మనస్ఫూర్తిగా మనల్ని ప్రేమించిన నర్సునే పెళ్లిచేసుకోవాలనీ, ఇల్లు స్వర్గతుల్యంగా పరిశుభ్రంగా వుండాలంటే నర్సుకే యింటి పెత్తనం యివ్వాలనీ, పెద్దవిసురు విసిరాడు. ఇరవై అడుగుల దూరంలో ఎదురుగుండా కూర్చొని వున్న పద్మావతి మొహంచూస్తూ, మావాడిమాట కాదనలేక పోయాను.

నా మొహంకేసి పరీక్షగా చూసి, పద్మావతికేసి చూపిస్తూ 'ఇది పెద్దమనిషిలాగే వుంది' అన్నాడు. నా శరీరము భగ్గుమని మండింది. మావాడి దృష్టికూడా ఆమె మీద వుందన్నమాట. 'పశువు! ఆమాత్రం కనిపెట్టలేక పోయాను, నామనసు' అనుకున్నాను.

'వెళ్లొస్తానురా' అని లేచాడు. మళ్లీ రమ్మనటానికి నాకు మనస్కరించలేదు. నేను రమ్మనకపోతే మాత్రం రాకుండా వుంటాడా యేమిటి? కడుపులో కుళ్ళంతా అణచిపెట్టుకొని 'ఊఁ' అన్నాను. వెడుతూ వెడుతూ, ఆమె దగ్గరికి - నా పద్మావతి దగ్గరికి - వెళ్లి బల్లమీద మోచేతులు ఆన్చి యేమిటో మాట్లాడాడు. ఆమె సమాధానం చెప్పింది చివరికి యిద్దరూ నవ్వుకున్నారు. వాడు వెళ్లిపోయాడు. నాకు ఆ సమయంలో కలిగిన భావాన్ని వర్ణించడానికి వీలులేదు.

వాడు వెళ్ళిపోగానే, మాలపల్లి తీసుకొని పద్మావతి నా దగ్గరికి వచ్చింది.

'ఇదుగోనండి చదివేశాను. థ్యాంక్సు' అంది.

'అప్పుడే, ఒక్కరోజులోనే -' అన్నాను నేను.

'అవును, రాత్రి కొంతచదివాను. పగలల్లా చదువుతూనే వున్నాను. పగలు నిద్దరకూడా పోలేదు -' అంది పద్మావతి.

'ఎలావుంది?' అని అడిగాను.

'అప్పాదాసు, జ్యోతిల ప్రేమమాత్రం చాలా అసమానంగా వుంది' అంది, పద్మావతి. ఆమెకు ప్రేమకూడా తెలుసునన్న మాట; ప్రేమఅంటే - ఎలా ప్రేమించాలో -!

పద్మావతి వెళ్లిపోవడానికి వెనకకు తిరిగింది.

'కాస్సేపు కూచోకూడదూ, మాట్లాడుతూనూ?' అన్నాను, ఎంతో ధైర్యం తెచ్చిపెట్టుకొని.

'అమ్మయ్యో, నర్సులు పేషెంట్లదగ్గర కూచుని మాట్లాడదమే. డాక్టర్లుచూస్తే, గొంతు కోసెయ్యరూ!' అంది పద్మావతి.

అయితే, నిజంగా కూచుని కబుర్లు చెపుదామనే వుంది కాబోసు ఆమె మనసులో, పాపం!

'ఇప్పుడు, ఇలాంటివేళ యెవరు రాబోయినారు లెస్తూ!' అన్నాను కొంచెం చొరవచేసుకొని.

'వచ్చినా రాకపోయినా, కూచుని యెప్పుడూ పేషెంట్లతోటి మాట్లాడకూడదు' అంది; ఆమె పెద వులు చిరునవ్వుతో అలంకరించాయి.



(కాస్సేపు కూచోకూడదూ)

'పోనీ, నిలుచునే మాట్లాడు!' అన్నాను. ఆమె అక్కడనుంచి వెళ్లిపోవడం యిష్టంలేక.

'ఏం మాట్లాడమంటారు చెప్పండి?' అంది, చిన్న నవ్వు నవ్వి.

ఏం చెప్పను !

కీచుకీచుమనే జోళ్ళ చప్పుడుతో మెడికల్ స్టూడెంటు వొకడు వచ్చి 'గుడీవినింగ్ సిస్టర్' అన్నాడు. ఘల్లు మనే కంఠంతో 'గుడ్ యీవెనింగ్' అంది పద్మావతి సన్నని కంఠముతో.

ఏదో అన్నాడు [illegible] నవ్వుతూ, అతడు. ముఖం చిట్లించుకొని ఆమె యేదో జవాబు చెప్పింది. రెండూ నాకు వినపళ్లేదు. అతడుమాత్రం తల వ్రేలాడేసుకొని చక్కా పోయాడు.

పద్మావతి నా కేసి తిరిగి 'వీళ్లకి బుద్ధిలేదు' అంది. నన్ను తప్ప యిం కెవ్వరిని ఆమె - అను కున్నాను.

ప్రక్కనున్న రోగి యెవడో 'మంచినీళ్లు!' అని ఆమెను పిలిచాడు. ఆమె వెళ్లిపోయింది. ఆమెచేత చాకిరీ చేయించుకోవడానికి, వీళ్లందరికీ గల అధికారము యేమిటో నాకు అర్థంకాలేదు. మళ్లీ ఆరాత్రి ఆమె నా దగ్గరకు రాలేదు. నేను పిలవ లేదు.

౮

ఆస్పత్రిలో నేను ఆ తరువాత సుమారు పది రోజులున్నాను. మొదటి అయిదారు రోజులు పద్మావతి నైట్ డ్యూటీలోనే వుంది. ఆ తరువాత పగటి డ్యూటీకి మార్చారు ఆమెను ఆ వార్డులోనే. నేను అమితంగా సంతోషించాను. వీలైనప్పుడల్లా ఆమెతోటి మాట్లాడే వాణ్ణి. చాలా కులాసాగా, నవ్వుతూ, హృదయపూర్వకంగా మాట్లాడేది. నాకు మరీ సంతోషం కలగడానికి పెద్దకారణ మేమిటంటే, ఆమె నైట్ డ్యూటీచేసే రోజులలో పగలూ, పగటిడ్యూటీ చేసేరోజులలో, ప్రొద్దుగూకే వేళా వచ్చేవాడు మా తమ్ముడు. మొదటి రెండు సార్లూ తప్ప వాళ్లు మళ్లా వొకర్ని వొకరు చూసుకో లేదు. ఒకరిమాట ఒకరు తలపెట్ట లేదు.

పద్మావతి మా తమ్ముడి విషయమై తలపెట్టనే లేదన్న మాట!

ఆస్పత్రిలో నేను ఉన్నన్నాళ్లూ నాతోటి ఆమె మాట్లాడిన పద్ధతిచూస్తే, నామీద ఆమెకి యెంతో ప్రేమా గౌరవమూ ఉన్నట్టుకూడా సూచిస్తోంది. నామటుకు నేను ధన్యుణ్ణి అనుకున్నాను పురుషుడు తను అందగత్తె అనుకొని ప్రేమించిన స్త్రీ, తిరిగి తన్ను ప్రేమిస్తోందని గ్రహిస్తే పొందే పరమానందాన్ని నేనూ పొందాను.

ఆస్పత్రినించి నన్ను డిశ్చార్జి చేసినరోజు, నేను పడిన విచారానికి అంతు లేదు. పద్మావతికి కూడా నేను ఆస్పత్రి లోంచి వెళ్లిపోవడం యిష్టము లేనట్టుగా, ఆమె మొహంలోని భావాన్ని నేను అర్థంచేసుకున్నాను.

'పద్మావతీ, వెడుతున్నా, నువ్వుచేసిన—' అని ఆరంభించాను, నా పెదవులు వణికాయి.

'అవేమీ చెప్పొద్దండి. నేను ఏంచేసినా, అదంతా నా డ్యూటీ' అంది పద్మావతి.

ఎంత నిర్మలమైన, నిరాడంబరమైన హృదయము, పద్మావతిది!

'సరే; మా రూముకి యెప్పుడేనా రాకూడదూ' అన్నాను; అంతధైర్యము నాకు ఎలా వచ్చిందో నాకే తెలియదు.

ఆమె నా కళ్లల్లోకి చూసింది.

'ఏం...' అన్నాను మళ్లీ.

'అలాగే లెండి' అంది.

'అయితే ఎడ్రసు రాసియివ్వనా?' అని కాగితం, కలంకోసం జేబు తడిమాను.

'అక్కర్లేదు. మీ యెడ్రసు నాకు తెలుసును' అంది.

ఎలా తెలుసును ఈమెకి. అడుగుదామని తటపటా యించాను. హాస్పిటలు షీటులో వ్రాసిన నా యెడ్రసు ఆమెచూసి వుంటుందని నాకు జ్ఞాపకము వచ్చింది. నా యెడ్రసుకూడా కనుక్కుందన్న మాట.

అయితే పద్మావతి నిజంగా నన్ను ప్రతి అడుగుకి, వెనక్కి లాగేకాళ్లను బలవంతాన ముందుకి సాగిస్తూ ఆస్ప త్రిలోనుంచి బయట పడ్డాను.

గదికి నేను వచ్చేటప్పటికి మా తమ్ముడు, స్కూలుకు వెళ్లడానికి డ్రస్సువేసుకుంటూ వున్నాడు.

'డిశ్చార్జ్ చేశారా ఏమిటి అన్నా?' అన్నాడు నన్ను చూడగానే.

'అవును, వచ్చేశాను. నిన్న సాయంత్రం నీతో చెప్పాను కదూ!' అన్నాను.

నా మనస్సు యెక్కడో వుంది.

'సరే; ఆఁ......నువ్వు కాలేజీ వెళ్లవన్న మాట?' అని అందుకున్నాడు మావాడు.

'ఆఁ. అవును, ఇంకా రెండు మూడు రోజులదాకా వెళ్లను నీరసం యింకా తగ్గలేదు' అన్నాను.

మావాడు వెళ్లిపోయాడు.

హోటలునుంచి అన్నం తెప్పించుకొని గదిలోనే భోంచేసేశాను.

ప్రొద్దుపోయేవేళ పద్మావతి మా గదికి వస్తుందనుకు న్నాను. గుమ్మంకేసి కళ్లుపెట్టుకొని, యెంతసేపు చూశా నో! పద్మావతి రాలేదు. కాలంగడిచిన కొద్దీ నా తాపత్రయం యెక్కువైంది. ఆమె రాలేదు.

చీకటి పడిపోయింది. గదిలో లైటు వెలుగుతూవుంది. పదిరోజుల యీ మధ్య నా జీవితంలో కలిగిన మార్పుకి నాకే ఆశ్చర్యము వేసింది. ఆలోచించుకుంటూ కూర్చు న్నాను. ఎనిమిదిన్నర అయిపోయింది. ఆమె యింకరాదు.

మా తమ్ముడు మెట్లుచప్పుడు చేసుకుంటూ పైకి వచ్చాడు. క్యారియరుతో అన్నంతీసుకొచ్చయ్యర్ మాకు వడ్డించాడు. ఇద్దరమూ భోజనంచేశాము. సిగరెట్లు వెలిగించాము.

'అన్నయ్యా, నీతోటి ఒకసంగతి చెప్పాలనుకుంటు న్నానురా' అన్నాడు మావాడు.

'వాడు యేంచెప్ప దలచుకున్నాడో, ముందు నేను ఊహించలేక పోయాను.

చెప్పు' అన్నాను

'నీమీద నాకున్న భక్తి గౌరవాల చేత, ఈ విషయం నేను నీకు చెప్తున్నాను. నాకు నువ్వు అవసరమైన సహాయం చెయ్యమని ప్రార్థిస్తున్నాను' అన్నాడు మా వాడు. నాకేమీ బోధపడ్డలేదు.

'చెప్పరా!' అని అడిగాను.

'పద్మావతిని పెళ్లిచేసుకుందామని వుందిరా' అన్నాడు.

నెత్తిమీద గొడ్డలితో బాదినట్లు దిమ్మరపోయాను నేను. మావాడు సూదుల్లాంటి తనకళ్లతో నావేపు చూస్తున్నాడు.

'నీమీద ఆమెకు యిష్టముందో లేదో కనుక్కొన్నావా?' అన్నాను. మాట్లాడడానికి నేను యెంతబాధ పడ్డానో నా గొంతుకను పట్టి మావాడు కనిపెట్టి వుంటాడు.

'ఆమెకి నామీద ప్రేమవుంది. ఆమెను నేను ప్రేమించాను. ఆమె నన్ను ప్రేమించింది. ఒకర్ని వొకరం మోసగించుకోవడం యిష్టంలేదు కనక పెళ్లిచేసుకుందామనుకున్నాము. మేమిద్దరమూ ప్రతిరోజూ కలుసుకుంటున్నాము' అన్నాడు.

నేను మాట్లాడలేదు.

'పద్మావతిని పెళ్లి చేసుకోకపోతే, నేను విషంత్రాగి చచ్చిపోతాను కాని బ్రతకనురా' అన్నాడు.

వాడి మొహంకేసి చూశాను. స్థిరనిశ్చయం వాడి మొహంలో స్పష్టంగా కనపడుతోంది.

నాస్థితి రొంపిలో దిగపడినట్లయింది.

'పద్మావతి, క్రిందవుంది, తీసుకొస్తాను;' అంటూ మావాడు క్రిందికి వెళ్లాడు. నేను ఆలోచనలో పడిపోయాను. ఏంచెయ్యను, ఇప్పుడు-? మావాడూ, పద్మావతీ యిద్దరూ చేతులు కలుపుకొని పైకివచ్చారు. నన్ను చూసి తలవొంచుకుంది పద్మావతి. సోదరిని ప్రేమించినట్లు ఆమెను ప్రేమించగలిగితే'

తళుక్కుని మెరుపు మెరిసినట్లు, ఆభావం నా హృదయంలో కలిగింది. అంతకన్న బ్రహ్మానందం వుంటుందని తోచింది.

'సరే, రా, మోహన్. పద్మావతిని నా సోదరిలా ప్రేమిస్తున్నాను. ఆమె క్రిస్టియను కనుక, కేశవ దేవ[illegible]ని చేత ఆర్యసమాజంలో శుద్ధిచేయించి, పెళ్లి చేసేసుకోండి. ఏమీ అనకుండా అమ్మా, నాన్నలకి ఉత్తరంరాసే బాధ్యత నాది' అనేశాను. అంతటి బాధ్యత నెత్తిన వేసుకోడానికి, నా హృదయంలో కలిగిన పరివర్తనకే నేనే పొంగిపోయాను.

ప్రియులిద్దరూ నా కాళ్లకి నమస్కారం చేశారు. వాళ్లు ఆ నిమిషములో పొందిన బ్రహ్మానందమే చాలు, నేను జీవించినన్నాళ్లూ నన్ను సుఖపెట్టడానికి.

---



Madras Agents:— C. J. Sheth